సాక్షి విజయనగరం

శనివారం | 5 | ఆగస్టు | 2023



ప్రకృతి పద్ధతిలో 'సాగు'దాం

సాగులో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోవడంతో పంటలు విషతుల్యమవుతున్నాయి.

- 8లో



వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలి

వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ జి.గౌరీశంకర్ అన్నారు.

- 8లో



రాకోడు పీహెచ్‌సీని సందర్శించిన కేంద్రబృందం

విజయనగరం రూరల్ మండలంలోని రాకోడు పీహెచ్‌సీను కేంద్రబృందం సందర్శించింది.

- 8లో

న్యూస్‌రీల్

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు
- హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ, తదితరులు

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన 'మన ఆరోగ్యం–మన చేతుల్లోనే, హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ చికిత్స తీసుకోవాల్సిన జాగ్రత్తలు' వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ పరీక్షలు అధికంగా నిర్వహించాలని చెప్పారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, ఎస్‌సీడీ వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, డీపీహెచ్ఎన్ఓ సత్యవతి, డీపీఎం బాలాజీ, సూపర్‌వైజర్ సాక్షి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం

- ఈ నెల 10, 17తేదీల్లో నులిపురుగుల నివారణ కార్యక్రమం
- 19ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- నేషనల్ ప్రోగ్రాం అధికారి ఆర్తి ఉపాధ్యాయ్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్తి ఉపాధ్యాయ్, డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యాన్ని దెబ్బతీసే నులిపురుగుల నివారణకు 0–19 ఏళ్లలోపు వయస్సు వారందరితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని నేషనల్ ప్రోగ్రాం అధికారి ఆర్తి ఉపాధ్యాయ్ పిలుపునిచ్చారు. ఈ నెల 10, 17 తేదీల్లో నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్తి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. దీనివల్ల రక్తహీనత లేకుండా, ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డీఐఓ అచ్యుతకుమారి, లోక్‌నాథ్, రమణ, చాముండేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

లింక్ తప్పిన గూడ్స్

- ట్రాఫిక్‌కు అంతరాయం



లింక్ తప్పిన గూడ్స్ బోగీలు

కొమరాడ: బొగ్గులోడుతో రాయఘడ నుంచి విశాఖపట్నం వైపు శుక్రవారం బొగ్గుతో వెళ్తున్న గూడ్స్ రైలు బోగీల లింకు స్వామినాయుడు వలస రైల్వేగేటు నుంచి ఆర్తాం రైల్వే గేటు మధ్య తప్పిపోయాయి. దీంతో ఇంజిన్ కొంత దూరం ముందుకు వెళ్లింది. అప్రమత్తమైన రైల్వేగార్డు స్పందించి ఇంజిన్ డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో విడిపోయిన బోగీలను మళ్లీ తగిలించి రైలును ముందుకు నడిపారు. ఈ ఘటనతో గంటసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఓ వైపు జాతీయరహదారి గోతులమయం కావడం, మూడు కిలోమీటర్ల పరిధిలో మూడు రైల్వే గేట్లు ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.



అంతర్‌రాష్ట్ర రహదారిపై నిలిచిన వాహనాలు

సాలూరు టీడీపీలో... ఆగని పోరు



- పార్టీలో వర్గాలుగా విడిపోయి ఫిర్యాదుల పరంపర
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణికి సెగ
- పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్ వర్గంపై కారాలుమిరియాలు
- పలు ఆరోపణలతో భంజ్‌దేవ్‌పై పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఫిర్యాదు
- మరోవైపు సంధ్యారాణి తీరుపై భంజ్‌దేవ్ అనుయాయుల వాట్సాప్ మెసేజ్‌లు
- సందట్లో సడేమియా అన్నట్లుగా సాలూరు సీటు కోసం మరో ముగ్గురు పోటీ!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

గుమ్మడి సంధ్యారాణి... నిన్నటి వరకూ ఎమ్మెల్సీ! ప్రస్తుతం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు. పార్టీ సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కూడా! 2024 సార్వత్రిక ఎన్నికల్లో సాలూరు నుంచి ఆమే పోటీచేస్తారని బలంగా వాదనలు ఉన్నాయి. మరోవైపు రాణాప్రతాప్ భంజ్‌దేవ్... టీడీపీలో సీనియరు నాయకుడు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకుడు, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చేతిలో పరాజయం పాలయ్యారు. సాలూరు నియోజకవర్గంలో ఆయన ప్రభ తగ్గిపోయింది. గెలుస్తామన్న నమ్మకం లేకపోయినా సరే.. అక్కడ పాగా వేయడానికి సంధ్యారాణి పావులు కదుపుతుండటంతో టీడీపీలో రచ్చ మొదలైంది. ఇది చినికిచినికి గాలివానగా మారినట్లు ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకోవడం వరకూ వెళ్లింది. చివరకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఇరువర్గాలను పిలిచి పంచాయితీ పెట్టినా చిచ్చు చల్లారనంతగా పరిస్థితి తయారైంది. వీరిద్దరి మధ్యా రచ్చతోనే తలలుపట్టుకుంటున్న టీడీపీ కార్యకర్తలకు ఇప్పుడు మరో తలనొప్పి మొదలైంది. సందట్లో సడేమియా అన్నట్లు భంజ్‌దేవ్, సంధ్యారాణిలకు గాకుండా తమకు మధ్యేమార్గంగా సాలూరు సీటు ఇవ్వాలంటూ మరో ముగ్గురు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఏజెన్సీ ముఖద్వారమైన సాలూరు నియోజకవర్గంలో టీడీపీ తరఫున భంజ్‌దేవ్ తొలి నుంచి నాయకత్వం వహిస్తున్నారు. చంద్రబాబుతోనే గాకుండా ఆయన కోటరీతోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. ఎన్‌టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవి నుంచి దించేసిన వైశ్రాయ్ హోటల్ ఘటనలో భంజ్‌దేవ్ చంద్రబాబు వైపే ఉన్నారు. నాటి నుంచి భంజ్‌దేవ్‌కు చంద్రబాబుతో సాన్నిహిత్యం కొనసాగుతోంది. కులధ్రువీకరణ పత్రం వివాదంలో ఎమ్మెల్యే పదవి కోల్పోయిన భంజ్‌దేవ్‌ను కాదని చంద్రబాబు 2009 సార్వత్రిక ఎన్నికల్లో గుమ్మడి సంధ్యారాణికి సీటు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియరు నాయకుడు, గిరిజనులు, గిరిజనేతరుల్లోనూ మంచి పేరున్న పీడిక రాజన్నదొర చేతిలో ఆమెకూ ఓటమి తప్పలేదు. తర్వాత రెండు దఫాల్లోనూ భంజ్‌దేవ్‌కు టీడీపీ సీటు వచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. సాలూరులో టీడీపీకి వరుసగా ఓటమికి సొంతపార్టీ వారి వెన్నుపోటే కారణమంటూ నాటి నుంచి సంధ్యారాణి వర్గీయులు భంజ్‌దేవ్‌పై, ఆయన అనుయాయులేమో సంధ్యారాణిపైనా ఆరోపణలు చేసుకోవడం మొదలెట్టారు. అలా మొదలైన కుమ్ములాట సంవత్సరాల తరబడి కొనసాగుతూనే ఉంది.

రగిలిపోతున్న భంజ్‌దేవ్ వర్గీయులు...

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలు, పరిపాలనా సంస్కరణలు, అభివృద్ధి పనులకు తోడు సీనియర్ నాయకుడు రాజన్నదొర ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. దీంతో సాలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలపడింది. గత మూడు దఫాలుగా ఓటుబ్యాంకు పెరుగుతూ రావడమే దీనికి నిదర్శనం. వరుస ఓటములతో టీడీపీ సందిగ్ధంలో పడింది. ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్లు పార్టీలో వర్గవిభేదాలు కాస్త భంజ్‌దేవ్ భవిష్యత్తుకు ఎసరుపెట్టాయి. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజన్నదొర చేతిలో ఓడిపోయిన భంజ్‌దేవ్‌ను పక్కనబెట్టి 2009 సార్వత్రిక ఎన్నికల్లో రాజన్నదొర చేతిలోనే ఓటమిపాలైన సంధ్యారాణివైపే టీడీపీ అధిష్టానం మొగ్గు చూపిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఇదే అదనుగా సంధ్యారాణి పార్టీపై పట్టు కోసం పావులు కదిపారు. మండల స్థాయిలోని భంజ్‌దేవ్ వర్గీయులు ఒక్కొక్కర్నీ పక్కనబెట్టడం మొదలెట్టారు. పార్టీలో వారి ప్రాధాన్యాన్ని తగ్గించేశారు. అంతేగాకుండా పార్టీలోని భంజ్‌దేవ్ వ్యతిరేకులను ప్రోత్సహించారు. వారు కూడా భంజ్‌దేవ్‌పై, ఆయన వర్గీయులపై ఆకాశరామన్న ఉత్తరాలు, వాట్సాప్ మెసేజ్‌లు, అధిష్టానానికి ఫిర్యాదులు మొదలెట్టారు. ఇలా సంధ్యారాణి వర్గీయులతో విసిగిపోయిన భంజ్‌దేవ్ అనుయాయులు రగిలిపోతున్నారు.

పంచాయితీతో మరింత బహిర్గతం...

భంజ్‌దేవ్, సంధ్యారాణి వర్గాల మధ్య సయోధ్య కుదర్చడానికి నేరుగా చంద్రబాబే ఇటీవల పంచాయితీ పెట్టారు. సంధ్యారాణిని గట్టిగా మందలించినట్లు పార్టీ గుసగుసలు వినిపించాయి. దీంతో సంధ్యారాణి వర్గీయులు రగిలిపోయారు. ఒక దశలో ఫ్రస్టేషన్‌తో ఆమె తన సెల్‌ఫోన్ నేలకేసి కొట్టినట్లు కూడా తెలిసింది. భంజ్‌దేవ్ వర్గీయుల ఫిర్యాదు వల్లే చంద్రబాబు వద్ద తనకు అవమానం జరిగినట్లు ఆమె మనస్తాపం చెందారనే మెసేజ్‌లు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. ఇక లాభం లేదని భంజ్‌దేవ్‌పై ఆరోపణలతో సంధ్యారాణి వర్గీయులు చంద్రబాబుకు లేఖలు రాశారు. అవి కూడా సామాజిక మాధ్యమాల్లోకి వచ్చేశాయి. ఫలితంగా టీడీపీ లోగుట్టు కాస్తా రట్టు అయ్యింది. ఈ నేపథ్యంలో మరోసారి అధిష్టానం నుంచి సంధ్యారాణికి పిలుపు వచ్చినట్లు తెలిసింది.

సంధ్యారాణికి సీటు హుళక్కేనా?

రానున్న ఎన్నికల్లో సంధ్యారాణికి సీటు రాకుండా అడ్డుకోవడానికి భంజ్‌దేవ్ వర్గీయులు సరికొత్త అస్త్రాన్ని ప్రయోగించారు. రాజకీయంగా, సామాజికంగా బలీయంగానున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పీడిక రాజన్నదొరను ఢీకొట్టాలంటే ఆయనకన్నా జాతకబలం ఎక్కువగా ఉన్న వ్యక్తికే సీటు ఇవ్వాలనే వాదనలు మొదలెట్టారు. ఇందు కోసం సాలూరులో ఓ సిద్ధాంతికి ఇప్పటికే కొందరి జాతకాలు చూపించినట్లు పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

సీటు కోసం మరో ముగ్గురు...

కుమ్ములాడుకుంటున్న భంజ్‌దేవ్, సంధ్యారాణిలకు గాకుండా సాలూరు సీటు కోసం ఇటీవల కాలంలో ముగ్గురు వ్యక్తులు బరిలోకి దిగారు. పాచిపెంట మండలానికి చెందిన ఓ గిరిజన మహిళ తన ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేసి మరీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఆమె భర్త కూడా సాలూరు సీటు కోసం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. తీరా భంగపాటు ఎదురవ్వడంతో మళ్లీ ఉద్యోగంలోకి వెళ్లిపోయారు. మక్కువ మండలానికి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడా టీడీపీ టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. అధిష్టానం హామీ ఇస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి దిగుతానని ఆయన చెప్పుకుంటున్నారు. పాలకొండ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కూడా తనకే బీఫారం వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఆయన ఇటీవల చంద్రబాబును కలిసిన ఫొటో బయటకు వచ్చింది.

ప్రత్యేక ప్రమాణాలతో ప్రభుత్వ భవనాలు



ఆర్థిక కార్యాలయాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ బొత్స సత్యనారాయణ

- ఆర్థిక కార్యాలయాల సముదాయ భవనాన్ని ప్రారంభించిన ఆర్థిక మంత్రి బుగ్గన, విద్యాశాఖ మంత్రి బొత్స
- నగర అభివృద్ధికి కృషిచేస్తాం: బుగ్గన



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక ప్రమాణాలతో ఒకే రూపంలో నిర్మిస్తున్నట్టు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. కలెక్టరేట్ సమీపాన రూ.14.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆర్థిక కార్యాలయాల సముదాయ భవనాన్ని విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలకు, కట్టడాలకు ఒకే విధమైన శాశ్వత, ప్రామాణికమైన డిజైన్లు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగాలకు అనుబంధంగా ఏపీ స్టేట్ ఆర్కిటెక్చర్ బోర్డు ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా ప్రభుత్వ భవనాలకు అవసరమైన అన్ని వసతులతో కూడిన ప్రామాణికమైన డిజైన్లు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనం శిథిలావస్థలో ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రస్తావించారని, దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల భవనం కూడా శిథిలవస్థకు చేరిందని తమ దృష్టికి తీసుకువచ్చారని, నివేదిక తెప్పించి తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరిన మేరకు ఫూల్‌బాగ్ రోడ్డుకు త్వరలోనే రూ.3 కోట్లు మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాని ఇతర ప్రభుత్వ కార్యాలయాల కంటే విభిన్నంగా ఆధునిక వసతులతో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఆర్థిక కార్యాలయాల సముదాయ భవనాన్ని నిర్మించినట్టు వెల్లడించారు. భవనానికి డిజైన్లు రూపొందించి ఉత్తమంగా తీర్చిదిద్దిన ఇంజినీర్లను మంత్రి అభినందించారు. కలెక్టర్ కార్యాలయ భవనం 1983 ప్రాంతంలో నిర్మించారని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరే పరిస్థితుల్లో ఉందని, కొత్త భవన నిర్మాణం చేపట్టాలని, లేదంటే తాత్కాలికంగా మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఆర్థిక మంత్రిని కోరారు. విజయనగరాన్ని సుందరీకరణ చేసే దిశగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న ప్రయత్నాలకు చేయూతనివ్వాలని సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో కీలకమైన ఆర్థికశాఖను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నాలుగేళ్లుగా అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నగర అభివృద్ధి, సుందరీకరణకు నాలుగేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాస్తున్నాయని, ప్రజలకు ఆహ్లాదం, ఆనందం కలిగిస్తున్నాయన్నారు. నగరం వచ్చేదనంతో ఉందని మంత్రి ప్రశంసించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్‌రావత్, ఖజానా శాఖ సంచాలకులు డాక్టర్ ఎన్.మోహనరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్, జేసీ మయూర్ అశోక్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరస్యయ్య, కంబాల జోగులు, జిల్లా ఖజానా అధికారి ఆర్‌ఏఎస్‌కుమార, ముఖ్యప్రణాళిక అధికారి పి.బాలాజీ, జిల్లా ఆడిట్ అధికారి అరుణకుమారి, అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ అధికారి (వర్క్స్)ఎం.రామసుబ్బయ్య, ఏపీజీఎల్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ ఫణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

నిర్లిప్తత.. నిర్లక్ష్యం వద్దు

- అత్యంత కచ్చితంగా ఓటర్ల జాబితా ఉండాలి
- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష



సమీక్ష సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, తదితర అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఎటువంటి తప్పులూ లేకుండా అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించాలని, తప్పులు దొర్లితే సహాయ ఎన్నికల అధికారులు (ఏఈఆర్‌వోలు), నియోజకవర్గ ఎన్నికల అధికారులు (ఈఆర్‌వోలు) బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. ఎన్నికల విధుల విషయంలో నిర్లిప్తత, నిర్లక్ష్యం పనికిరాదని అధికారులకు హితవు పలికారు. నిర్ణీత కాలవ్యవధిలోగా పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో సొంత నిర్ణయాలు పనికిరావన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పూర్తి ఆధారాలతో దరఖాస్తు చేసిన తరువాత మాత్రమే మార్పులు చేర్పులు, తొలగింపులు చేయాలని సూచించారు. తొలగించిన ప్రతీ ఓటుకు, దానికి సంబంధించిన దరఖాస్తు కచ్చితంగా తమవద్ద ఉండాలని, దాన్ని భద్రపర్చాలని స్పష్టం చేశారు. నిబంధనలపై బీఎల్ఓలకు మరోసారి అవగాహన కల్పించాలని చెప్పారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటుహక్కును కల్పించే బాధ్యత ఉందన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, సత్వరమే నిర్వహించాలని, ప్రతీ ఇంటికీ వెళ్లి వివరాలను సేకరించాలని కలెక్టర్ చెప్పారు.

రీసర్వే వేగవంతం చేయాలి: జేసీ

జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. వివరాలను నమోదు చేసే ప్రక్రియలో భాగంగా తహసీల్దార్ లాగిన్‌లో దీర్ఘకాలం పెండింగ్ ఉండటం పట్ల సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. సుమారు 450 గ్రామాల్లో శనివారం నుంచి సర్వే రాళ్లను పాతే పనులను ప్రారంభించాలన్నారు. 40 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సెలవు రోజుల్లో కూడా పనిచేస్తే తప్ప ఈ పనులు సకాలంలో పూర్తి కావన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.గణపతిరావు, ఈఆర్వోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

శివ్వాంలో ఏనుగుల గుంపు

వంగర: గజరాజుల గుంపు మళ్లీ వంగర మండలం వైపు వస్తున్నాయి. గురువారం అర్ధరాత్రి నాగావళి నదిని దాటుకుని పార్వతీపురంమన్యం జిల్లా బిటివాడ గ్రామం వైపు వెళ్లిపోవడంతో వంగర మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఏనుగుల గుంపు వాటి దిశ మార్చుకుని గత మూడు రోజులుగా తిష్టవేసిన శివ్వాం గ్రామ పరిసర ప్రాంతాల్లోకి చేరుకోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



శివ్వాం పంటపొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

నేడు బయోమెట్రిక్ డ్రైవ్

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వ మైనారిటీ ఉపకార వేతనాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల బయోమెట్రిక్ అథంటికేషన్ ప్రక్రియకు కెమిస్ట్ ఫంక్షన్ హాల్ పక్కన కేబీమార్ట్‌లో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తామని జిల్లా నోడల్ అధికారిని లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కాలర్‌షిప్‌పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన అభ్యర్థులు హెచ్ఓఐ, ఐఎన్ఓ అధికారి ఆధార్ కార్డ్, ఎన్ఎస్‌పీ యూసర్ ఐడీ, పాస్‌వర్డ్‌లతో ఆధార్ అథెంటికేషన్ చేయించుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్: 93399 969735, 88974 74626 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నగరంలో నేడు

- ఉదయం 10 గంటలకు: విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మిల్లెట్స్ వరల్డ్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభిస్తారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొంటారు.
- ఉదయం 11 గంటలకు: విజయనగరంలోని గాజులరేగ వద్ద ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరిశీలిస్తారు. తర్వాత కళాశాల బోధనా సిబ్బందితో మంత్రి రజని మాట్లాడతారు.
- మధ్యాహ్నం 3 గంటలకు: రాజాం అసెంబ్లీ నియోజకవర్గ సమీక్ష సమావేశం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన జరుగుతుంది. రాజాం ఎమ్మెల్యే రాజాం జోగులతో పాటు మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్, కలెక్టర్ పాల్గొంటారు.
- సాయంత్రం 4.30 గంటలకు: విజయనగరంలో గురజాడ కళాభారతి దరి టీటీడీ కల్యాణ మండపంలో అఖిలభారత చేనేత వస్త్ర ప్రదర్శనను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తారు.

మనవద్దకే 'మిల్లెట్స్ వరల్డ్'

9.8.2022: ఉమ్మడి విజయనగరం జిల్లాలో చిరుధాన్యాలు, అటవీ ఉత్పత్తుల విక్రయానికి దోహదం చేసేలా సహకారం అందిస్తానని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీతంపేటలో నిర్వహించిన బహిరంగ సభలో హామీ ఇచ్చారు.

5.8.2023 : సరిగ్గా ఏడాది కాలంలోనే జెడ్పీ చైర్మన్ హామీ కార్యరూపం దాల్చింది. జెడ్పీ కార్యాలయ ప్రాంగణానికి ఆనుకొనే దుకాణాలు ఏర్పాటు చేయించారు. గిరిజనులు పండించే చిరుధాన్యాలు, ఇతర అటవీ ఉత్పత్తుల విక్రయించే బాధ్యతను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు అప్పగించారు. మిల్లెట్స్ వరల్డ్ దుకాణాన్ని శనివారం మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించనున్నారు.

- జెడ్పీ ప్రాంగణం వద్ద ఏర్పాటు
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక దుకాణం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహకారంతో సాకారం
- నేడు మంత్రి బొత్స చేతుల మీదుగా ప్రారంభం



చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారపదార్థాలను కొనుగోలు చేస్తున్న మహిళలు



జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మిల్లెట్స్ వరల్డ్ దుకాణం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

మన పంట..మన వంట.. మన ఆరోగ్యం... అనే నినాదంతో మిల్లెట్స్ వరల్డ్ ప్రజల ముందుకు వచ్చింది. విటమిన్లు, మినరల్స్, ఐరన్ సమృద్ధిగా ఉండే చిరుధాన్యాలతో తయారుచేసే ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు ఇక్కడ లభ్యంకానున్నాయి. ఇటీవల కాలంలో చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాల వినియోగం గణనీయంగా పెరిగింది. టైప్–2 మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, రొమ్ము కేన్సర్, గుండె జబ్బులు, గ్యాస్ట్రిక్, అల్సర్ ఇలా అనేక సమస్యల నియంత్రణకు చిరుధాన్యాలు దోహదం చేస్తాయని వైద్య నిపుణులు సూచించడంతో ప్రభుత్వం కూడా చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. రేషన్ డిపోల ద్వారా రాగిపిండిని సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలోనే గిరిజనులకు ప్రోత్సాహంగా ఉండేలా దుకాణాల ఏర్పాటుకు సహకారం అందిస్తానని గత ఏడాది ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. జెడ్పీ కార్యాలయ ప్రాంగణానికి ఆనుకొని దుకాణాలు ఏర్పాటు చేయించారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య అధికారులు మహిళా సంఘాలతో మిల్లెట్స్ వరల్డ్ దుకాణాన్ని ఏర్పాటు చేయించారు. అంతేకాదు కాఫీ, టీ, ఇతర పానీయాలు, ఐస్‌క్రీమ్, బేకరీ ఉత్పత్తులను కూడా అందించేందుకు గాటోస్ సంస్థ సహకారంతో జిల్లా సమాఖ్య ఇక్కడే కాఫీ షాప్‌ను కూడా ఏర్పాటు చేస్తోంది. దీనిని కూడా మహిళా సంఘాలే నిర్వహిస్తాయి.

క్లుప్తంగా

నేడు మత్స్యకారులకు అవగాహన సదస్సు

పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని ఆర్‌సీఎం పాఠశాల సమావేశ మందిరంలో మత్స్య సహకార సంఘాలకు అవగాహన సదస్సును శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. పీఎంఎస్‌వై స్కీంలో చేప పిల్లలను నిల్వచేసేందుకు ఉన్న మార్గదర్శకాల గురించి చర్చించేందుకు మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులు సదస్సులో పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి మత్స్యకారులు హాజరు కావాలని కోరారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయిలో ఉత్తమ క్రీడాప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, శిక్షకులు, గురువులు, వ్యాయామ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పురస్కారాలు ప్రదానం చేసేందుకు అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 13వ తేదీలోగా తమ దరఖాస్తును విజయనగరం లోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హోటల్ జీఎస్‌ఆర్‌లో అందజేయాలని సూచించారు.

యాచకురాలికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురం: పట్టణంలోని 22వ వార్డు గాంధీ సత్రం దగ్గర కొన్నేళ్లుగా యాచకవృత్తి చేసుకుంటూ నివాసం ఉంటున్న వృద్ధురాలు అనారోగ్యం కారణంగా శుక్రవారం మృతిచెందింది. ఈ మేరకు 22వ వార్డు కౌన్సిలర్ ఆకుల శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణ, కె.శేఖర్, కె.సంతోష్ తదితరులు బెలగాం శివారు శ్మశానవాటికలో అంత్యక్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పోలీసులు తమవంతు సహకారం అందించారు.

14న ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచితంగా అందజేసే స్వయం ఉపాధి శిక్షణకు ఈ నెల 14వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. నాబార్డు సహకారంతో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో 50 రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నామని, దీనికి పదో తరగతి, ఐటీఐ చదివిన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లోని 19 నుంచి 35 ఏళ్ల యువకులు అర్హులన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 6304626372, 9989057455ను సంప్రదించాలని కోరారు.

అమృత్‌భారత్‌లో జిల్లాకు గౌరవం

విజయనగరం టౌన్: అమృత్ భారత్ పథకం జిల్లాను వరించింది. ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన రైల్వేస్టేషన్‌లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతాయి. అమృత్‌భారత్ స్టేషన్‌గా విజయనగరం ఎంపికై నట్లు, ఈ నెల 6న రైల్వేస్టేషన్ ఆవరణలో అభివృద్ధి పనులకు నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం, దువ్వాడ, దమన్‌జోడి స్టేషన్‌లు అమృతభారత్ పథకంలో ఉన్నాయన్నారు. విజయనగరం రైల్వేస్టేషన్‌ను రూ. 35.16 కోట్లతోనూ, దువ్వాడ రూ. 26.31 కోట్లతోనూ, దమన్‌జోడి రైల్వేస్టేషన్‌ను రూ. 13.93 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని వివరించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

ప్రకృతి పద్ధతిలో 'సాగు'దాం

- ఇప్పటివరకు వరి మాత్రమే
- ఈఏడాది నుంచి మొక్కజొన్న, కూరగాయలు, ఉద్యాన పంటలు


చీపురుపల్లి మండలంలో పచ్చి రొట్ట ఎరువులను కలియదున్నుతున్న రైతు



జామి మండలం శిరికిపాలెంలో ప్రకృతి సాగు పద్ధతిలో వరి నాట్లు వేస్తున్న మహిళలు


రాజాం మండలం గారాజు చీపురుపల్లిలో ప్రకృతి సాగు పద్ధతిలో కూరగాయలు


వేపాడ మండలం చామలపల్లిలో జీవామృతం తయారు చేస్తున్న మహిళా రైతు

విజయనగరం ఫోర్ట్: సాగులో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోవడంతో పంటలు విషతుల్యమవుతున్నాయి. వాటి వల్ల జనం వింత రోగాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా తక్కువ వయస్సులోనే బీపీ, సుగర్, గుండెజబ్బులతో ఇబ్బంది తప్పడం లేదు. అన్ని పంటలసాగులోను రసాయనిక ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. దీని వల్ల అనేక అనర్థాలు ఉండడంతో ప్రభుత్వం ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఎరువులతో సాగు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతి రైతు చేపట్టేలా చైతన్యవంతం చేయడం జిల్లాలో 34 మందిని ఎంపిక చేశారు. వారికి ప్రకతి వ్యవసాయంపై రైతు-శాస్త్రవేత్త పేరిట శిక్షణ ఇస్తోంది. వీరికి శిక్షణ ఇచ్చి డిప్లమో సర్టిఫికెట్ కూడా ఇవ్వనున్నారు. అంతేకాకుండా వారు నేర్చుకున్న దానిపై పరీక్ష కూడా నిర్వహిస్తారు.

ప్రకృతి సాగులో మొక్కజొన్న, కూరగాయలు

గత ఏడాది వరకు వరి పంటను మాత్రమే ప్రకృతి పద్ధతిలో సాగు చేసేవారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, ఉద్యాన పంటలు కూడా సాగుచేయాలని అధికారులు నిర్ణయించారు.

ఈ ఏడాది ఖరీఫ్ లక్ష్యం 50 వేల ఎకరాలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో 50 వేల ఎకరాల్లో ప్రకతిసాగు పద్ధతిలో పంటల సాగు చేపట్టాలని ప్రకతి వ్యవసాయ విభాగం అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వరి పంట 35 వేల ఎకరాలు. మొక్కజొన్న 4 ఎకరాలు, కూరగాయలు 5 ఎకరాలు, 6 ఎకరాలు ఉద్యాన పంటలు సాగు చేయాలని నిర్ణయించారు. గత ఏడాది సాధారణ పద్ధతిలో వరి పంట దిగుబడి 27 బస్తాలు రాగా, ప్రకతి సాగు పద్ధతిలో 29 బస్తాల దిగుబడి వచ్చింది. గత ఏడాది 26 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు పద్ధతిలో వరి పంట సాగు చేశారు. ప్రకృతి సాగు పద్ధతిలో ముందుగా నవధాన్యాలైన మినుము, పెసలు, నువ్వులు, ఉలవలు, రాగి, బొబ్బర్లు, శనగలు, కంది, కట్టిజనుము ఒక్కొక్కటి కేజీ చొప్పున 9 కేజీలు, సుగంధద్రవ్యాలైన మెంతులు, ఆవాలు, ధనియాలు 100 గ్రాములు, కూరగాయలు, ఆకుకూరలైన తోటకూర, గోంగూర, ఆనప, బీర విత్తనాలు 100 గ్రాములు వరి పంట సాగు చేయడానికి 45 రోజుల ముందు పొలంలో చల్లాలి. విత్తనాలు చల్లిన 45 రోజుల తర్వాత పొలంలో కలియదున్ని అప్పుడు వరి పంటను సాగు చేయాలి. అయితే ప్రస్తుతం వర్షాలు అధికంగా కురవడం వల్ల 25 రోజులకే నవధాన్యాలు కలియదున్ని పంటలు సాగు చేసుకోవచ్చు.

ప్రకృతి సాగు పెరిగేలా చర్యలు

> ప్రకతి వ్యవసాయ పద్ధతిలో రైతులందరూ సాగు చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఏటా ప్రకృతి సాగు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది 26 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే ఈఏడాది వరితో పాటు మిగతా పంటలు 50 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. – వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఈ విధానం వల్ల ప్రయోజనం :

సుగంధ ద్రవ్యాలు, నవధాన్యాలు, కూరగాయ, ఆకుకూర విత్తనాలు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో కూడా తేమను నిలబెట్టుకుంటుంది. వానపాములు పెరుగుతాయి. వేరు వ్యవస్థ దృఢంగా ఉంటుంది. గింజబరువు పెరుగుతుంది.

సాగు ఖర్చు తగ్గుతుంది

ప్రకృతి విధానంలో సాగు చేయడం వల్ల సాగు ఖర్చు తగ్గుతుంది. 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. కాబట్టి పంటలో ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల ఎకరాకి రూ.3 వేల వరకు ఖర్చు తగ్గుతుంది. జీవామృతాన్ని ప్రతి 10 రోజులకు ఎకరాకి 200 లీటర్ల చొప్పున పిచికారీ చేయాలి.

సర్వజన ఆస్పత్రిలో మెరుగైన సేవలు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు దివీస్ ల్యాబ్ సీఎస్‌ఆర్ నిధులు రూ. 5 లక్షలు వెచ్చించి సమకూర్చిన వైద్య పరికరాలను రాజా ఎమ్మెల్యే కంబాల జోగులుతో కలిసి స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో వీలైనంత త్వరలోనే క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎప్పటి నుంచో రోగులు, వైద్యులు, రోగులు దీనిపై విజ్ఞప్తులు ఇస్తున్నారని త్వరలోనే అన్ని రకాల వసతులతో కూడిన క్యాంటీన్ నిర్మించేందుకు అనువైన స్థలాన్ని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడ్డాయని, ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి. గౌరీశంకర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ. రమణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బొత్స సంతోష్, ఆర్‌ఎంఓ డాక్టర్ పసుపులేటి లక్ష్మణరావు ఘోషాఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారం, సంక్షేమానికే ప్రాధాన్యం

- ఎస్పీ ఎం.దీపిక


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికే ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన సెరిమోనియల్ పరేడ్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై, ఆర్మ్‌డ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బందికి ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. పోలీసు సిబ్బంది విజ్ఞప్తి మేరకు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా మంజూరు చేసే రుణాలపై వడ్డీ శాతాన్ని తగ్గించామని తెలిపారు. పోలీసు సిబ్బంది వారికి అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, నిజాయితీగా , అంకిత భావంతో నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం, ఆర్మ్‌డ్ పోలీసు సిబ్బందితో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు చేపట్టి, సిబ్బంది సంక్షేమానికి భరోసా కల్పించారు. ఈ సెరిమోనియల్ పరేడ్‌కు ఆర్‌ఎస్సై శ్రీనివాసరావు కమాండర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్‌ఐలు ఎస్.గోపాల నాయుడు, బి.రమణమూర్తి, ఆర్‌ఎస్సైలు నారాయణరావు, రామకృష్ణ, నీలిమ, ప్రసాదరావు, కేశవరావు, శ్రీనివాసరావు, అక్షయకుమార్, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్స్‌పై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఎం.యశోధనరావు

విజయనగరం ఫూల్‌బాగ్: స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్స్‌పై వసతిగృహ సంక్షేమాధికారులతో స్థానిక బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఎం యశోధనరావు శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమాధికారులు రాజులమ్మ, శ్యామలాకుమారి, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్‌ల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన
- 15 తేదీలోగా వేతనాలు చెల్లిస్తామని కలెక్టర్ హామీ


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

విజయనగరం ఫూల్‌బాగ్: గ్రీన్ అంబాసిడర్‌లు, పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. 18 నెలలుగా వేతనాలు లేకుండా ఎలా పని చేయాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం లోపలికి వెళ్లి అధికారులకు తమ బాధ చెప్పుకునేందుకు ప్రయత్నం చేయగా సీఐటీయూ నాయకులను పోలీసులు అరెస్టు చేసేందు ప్రయత్నించారు. దీంతో కార్మికులు పోలీసులు అరెస్టులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో తోపులాటలు జరిగాయి. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి లోనికి వెళ్లి కలెక్టర్‌కు సమస్యను వివరించారు. దీనికి స్పందించిన కలెక్టర్ 15 తేదీ లోగా కార్మికులు వేతనాలు చెల్లిస్తామని, అదే విధంగా తొలగించిన కార్మికులందరినీ పనిలోకి తీసుకుంటామని, పంచాయతీ ల్లో టెండర్ ద్వారా కార్మికులను తీసుకునే విధానాన్ని రద్దు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా కార్యదర్శులు వి.లక్ష్మి, బి.సూర్యనారాయణ, గ్రీన్ అంబాసిడర్‌లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిల రమణ, పారిశుద్ధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు దండి శ్రీనివాస, సీఐటీయూ నాయకులు బి.శ్రీను, బోని రామారావు, తోటయ్య, కామేష్, సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో విజిలెన్స్ దాడులు

రాజాం సిటీ: రాజాం పట్టణంలో అక్రమంగా విక్రయాలు చేపట్టిన సిగరెట్ ప్యాకెట్ల గొడౌన్‌పై విజిలెన్స్ ఎస్సై బి.రామారావు, లీగల్ మెట్రాలజీ ఎస్సై ఎ.బలరామకృష్ణలు శుక్రవారం దాడిచేసి రూ. 6.17 లక్షలు విలువైన నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిషేధిత సిగరెట్లతోపాటు పొగాకు ఉత్పత్తులు జోరుగా విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. పట్టణానికి చెందిన మామిడిపాక సాయికృష్ణ వీటిని అక్రమంగా నిల్వ ఉంచడంతోపాటు విక్రయాలు చేపడుతున్నాడని తెలిపారు. స్వాధీనం చేసుకున్న సిగరెట్ ప్యాకెట్‌లను రాజాం పోలీసులకు అప్పగించామని చెప్పారు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు.

విజయనగరంలో..

విజయనగరం క్రైమ్: నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లా కేంద్రంలో శుక్రవారం పలు చోట్ల దాడులు నిర్వహించారు. వెంకటలక్ష్మి స్వీట్స్, లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, పీడబ్ల్యూడీ మార్కెట్‌లో తనిఖీలు చేసి రూ.56వేల 840 విలువైన పొగాకు ఉత్పత్తులను కనుగొని, సంబంధిత యజమానిపై కేసు నమోదుచేశారు. అలాగే పట్టణంలోమరోచోట రూ.34వేల 800 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు.

గంజాయి కేసులో ముద్దాయిలకు ఐదేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: 2017లో నమోదైన గంజాయి కేసుకు సంబంధించి బొబ్బిలి పట్టణానికి చెందిన నిందితులు బూర్లి గోవింద, పొట్టేలు రమణలకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి.రజని శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఈ మేరకు బొబ్బిలి సీఐ ఎం.నాగేశ్వరరావు విలేకరులకు శుక్రవారం తెలిపారు. 2017 సెప్టెంబరు 8న బొబ్బిలి రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు గోనె సంచుల్లో 5కిలోల 190 గ్రాముల గంజాయి ప్యాకెట్లు అక్రమంగా కలిగి ఉన్నట్లు బొబ్బిలి పోలీసులకు అందిన సమాచారంతో అప్పటి బొబ్బిలి ఎస్సై ఐ.రవీంద్రరాజు కేసు నమోదు చేయగా, సీఐ గోవిందరావు దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రాలను దాఖలు చేశారు. విచారణలో నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు విధించారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లాన రవి వాదనలు వినిపించారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ


దీపాల కాంతిలో ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత తాత్కాలిక యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద నిత్య కల్యాణ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్లి సహస్ర దీపారాధన మంటపంపై ఉన్న ప్రత్యేక పల్లకిలో వేంజేపు చేశారు. అనంతరం సహస్ర దీపాలను వెలిగించి స్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు.

నరసన్నపేట అసెంబ్లీ పరిశీలకుడిగా వాకాడ నాగేశ్వరరావు


వాకాడ నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ప్రజాప్రతినిధులు

పార్వతీపురంటౌన్: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో వాకాడ నాగేశ్వరరావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలి

- డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్


పదోన్నతి పొందిన వైద్యులకు రిలీవింగ్ ఆర్డర్స్ ఇస్తున్న డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్

విజయనగరం ఫోర్ట్: వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్ అన్నారు. ఈ మేరకు వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్స్‌గా పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా పదోన్నతితో బదిలీ అయింది. ఈ సందర్భంగా శుక్రవారం వారికి డీసీహెచ్‌ఎస్ కార్యాలయం రిలీవింగ్ ఆర్డర్స్‌ను ఆయన అందజేశారు. నెల్లిమర్లలో జనరల్ సర్జరీ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ డి.వి. శ్రీనివాస్‌కు సీతంపేట ఆస్పత్రికి పదోన్నతితో బదిలీ అయింది. ఎస్. కోట ప్రాంతీయ ఆస్పత్రిలో మత్తు వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ పద్మావతిని రంపచోడవరం, బాడంగి సీహెచ్‌సీలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న సుజనాకుమారికి అమలాపురం ఆస్పత్రికి పదోన్నతిపై బదిలీ అయింది.

రాకోడు పీహెచ్‌సీని సందర్శించిన కేంద్రబృందం


పీహెచ్‌సీ అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యుడు ఆర్తి ఉపాధ్యాయ

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్రబృందం సభ్యుడు ఆర్తి ఉపాధ్యాయ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినాన్ని పురస్కరించుకుని విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, పిల్లలకు నులి పురుగుల మాత్రలు అందించాలని సూచించారు. నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించాలని చెప్పారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జొన్నవలస గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కడపలో బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


వైఎస్సార్ కడప జిల్లాలో జరుగుతున్న పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు

విజయనగరం: వైఎస్సార్ కడప జిల్లాలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు సీనియర్స్ విభాగంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన ఆర్.నిఖిల్, కె.ముఖేష్ కుమార్, జి.నవీన్ కుమార్, కె.హనీష్‌లతో పాటు బి.హరిక, పి.మౌనిక పాల్గొంటారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్ తెలిపారు. ఆరుగురు క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లిన క్రీడాకారులను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ కోలగట్ల వీరభద్రస్వామి, అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్‌ప్రసాద్, ఎంకేటీ శ్రీను అభినందించారు.

ఐటీఐ అప్రెంటిస్ మేళాకు స్పందన


మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీగిరి

విజయనగరం అర్బన్: ఐటీఐ కోర్సులు పూర్తి చేసి ఉద్యోగ, ఉపాధి కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు ఉపయోగపడే అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన లభించింది. ప్రముఖ పరిశ్రమ మేథో సర్వో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ స్థానిక ఐటీఐ శిక్షణ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ మేళాకు జిల్లా వ్యాప్తంగా 70 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీగిరి మాట్లాడుతూ అప్రెంటిస్‌కు ఎంపికైన అభ్యర్థులు తమ ట్రేడ్‌కు సంబంధించిన పరిజ్ఞానాన్ని ఉపాధి, ఉద్యోగాలకు అనుగుణంగా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధులు రంగారావు, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చేరిన ఆశ్రమ విద్యార్థి


ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న విద్యార్థి కృష్ణమోహన్

భామిని: మండలంలోని మనుమకొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆరిక కృష్ణమోహన్ గుండెనొప్పితో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందుతున్నాడు. నాలుగు రోజుల నుంచి కడుపు పక్క నొప్పితో బాధపడుతున్న కృష్ణకుమార్‌ను బత్తిలి పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించినట్లు హెచ్ఎం శంకరరావు తెలిపారు. నొప్పి తగ్గక పోవడంతో సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించగా శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారన్నారు.విద్యార్థి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు.